# రాచటీకపు జరుగుబాటు

అడపా రామకృష్ణరావు

వెనకటి కేదో దేశపురాజు పిల్లలులేకుండా పరమపదాన్ని చేరుకుంటే ఆ దేశస్థులు క్రొత్తరాజు నెన్నుకోవడంకోసమని దివాణపు ఏనుగుతొండాని కొక పూలమాలనందించి విడిచిపెట్టారట. అది చూసిచూసి వీధినపోయే ఒక నిర్భాగ్యుడి మెడలో మాలవేసిందట. ఆపళంగా వాడు అనుకోపెట్టకుండా ఒక శుభముహూర్తపువేళ రాజై కూచున్నాడట.

అదే దేశమో, ఏం కథో నాకైతే తెలియదు కానీ నేనుకూడా యథావిధిగా తింటూ, తిరుగుతూ, కబుర్లుచెపుతూ, పేకాటఆడుతూ వుండివుండి హఠాత్తుగాఒక సుప్రభాతపు వేళ రాజునై కూచున్నాను. రాజునైనానంటే రత్నసింహాసనంమీద కూచుని రాజ్యమేలానని కాని, పసిడిబొమ్మవంటి ఒక రాజకుమార్తెను పరిణయమాడానని కాని చెప్పటం నాఉద్దేశ్యం కాదు. అంత అట్లా కాదు కాని చిన్నపరిమాణంలో తగుమాత్రంగా నేనూ రాజునైనాను.

ఏలడానికి మనకు ఏ 'చతురంబోధిపరీత భూవలయాలూ' లేనిమాట వాస్తవమే. ఐతే ఉన్న ఆ చిన్నయింటికే-ఆ కాస్త గదికే ఏలికనైనాను. నేను రాజునైన ఆ రోజున ప్రతివారు ఆ గదిలో కిరావడానికి కొంచెం సందేహిస్తారు. నామనోభావాన్ని గ్రహించడానికి యత్నిస్తూ, సంకోచిస్తూ తారాడడం. నేను చూడడం. పోనీ పాపమని చెప్పి నేనొక కటాక్షవీక్షణాన్ని వారివంక ప్రసరింపజేయడం. అప్పుడు వారు సవినయంగా నన్ను చేరరావడం. ఆ రోజున నాదర్శనాని కింత తతంగం నడుస్తుంది.

వందిమాగధులు లేరని దిగులుపడ నవసరంలేదు. ఆ రోజున నన్ను చేరవచ్చే ప్రతివ్యక్తీ-ఇదివఱకు నేను చెడిపోతున్నానని ప్రత్యక్షంగానో, పరోక్షంగానో రోజూ దూషించేవాళ్ళుగూడా-నా గుణగణాల్నిగూర్చి వేనోళ్ళ శ్లాఘించడమే. నమ్మబుద్ధి పుట్టదు కానీ ఆ 'రాచటీకం'లో వున్న మహిమయే అటువంటిది.

కోరింది తడవుగా ప్రతివస్తువూ, సమకూర్చడానికి అందఱూ శ్రద్ధగా ఎదురుచూస్తారు. "ఏమిటమ్మా కావాలి?" "పనసతొన"-ఊళ్ళో వుండవు. మఱో వూరునుంచి తేవడానికి అప్పుడే సత్యం ప్రయాణమౌతాడు. అందరూ 'ఏం తినాలని మనసవుతున్న'దని అడిగేవారే. అందరూ నా అమూల్యవాంఛలు నిమిషాలమీద నెరవేర్చడానికి బద్ధకంకణులై చేరినవారే.

ఆ రోజున అప్రయత్నంగా నా మాటకు ఎనడూ లేని విలువ వచ్చి పడుతుంది. ఇతఃపూర్వం నేనేమి చెప్పినా పెడచెవిని పెట్టే దయగల బంధుమిత్రులంతా ఆ నాడు నామాటను వేదవాక్యంగా శిరసావహిస్తారు. అర్థమూ, అంతమూలేని తమ ప్రశ్నా ప్రవాహానికి నా నోటినుంచి ఏ చిన్నసమాధానం వచ్చినా అదే మహాప్రసాదమని భావించి సంతోషిస్తారు.

ఈ వైభవం మాట అటుంచండి. ఆ రోజున ఎవరూ నన్ను హింసపెట్టడానికి పూనుకోరు. నేను పరీక్షలు తప్పుతున్న సంగతీ, పత్రికలకు వ్యాసాలు వ్రాస్తున్న సంగతీ తాత్కాలికంగా నాన్న మఱచిపోతాడు. అత్తయ్య నాకు కూరగాయలు మంచివి ఏరి తెచ్చుకోవడం రాదనీ, ఏ పనీపాటా లేకుండా వీధిన తిరగడం మాత్రమే చేతనవుననీ ఆ నాడు నిందించదు. పాపం రోజూ ఏదో నొప్పితో బాధపడే చెల్లాయికూడా ఆ నాడు తనసంగతి మఱచిపోయి నావిషయమే శ్రద్ధతీసుకుంటుంది.

ఇట్లా సమస్తమైనవారి గౌరవాభిమానాలకూ నోచుకుని ఆ నాడు నేను రాజునై చిత్తం వచ్చినట్టు పదవి వెలిగిస్తాను. ఆ నాడు నా పని మూడు పువ్వులు ఆరుకాయలుగా వుంటుంది. అందుకే ఇటువంటి 'రాచటీకం' ఇట్లా నూటికీ కోటికీ ఒక నాడు కాక కలకాలమూ వుంటే ఎంతబాగుండునా అని ఆశపడుతూవుంటాను. కాని దాని సొమ్మేమి పోయిందో ఆ వచ్చిన జ్వరం నన్ను కాస్తమరి నాలుగురోజులపాటు రాజవైభవ మనుభవింప నివ్వకుండా ఇట్టే మురిపించి మరునాడే తుర్రున పారిపోయింది.

---

* ఆనందవాణి